కంపించిన భూమి

ఆందోళనతో ఇళ్ల నుంచి బయటకు వచ్చిన ప్రజలు

ప్రజాశక్తి-బొబ్బిలి, సాలూరు

బొబ్బిలి, సాలూరు, రామభద్రపురం, మక్కువ మండలాల పరిధిలో బుధవారం మధ్యాహ్నం భూమి కంపించింది. పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో భూమి మధ్యాహ్నం 2.15గంటల సమయంలో రెండు సెకన్ల పాటు కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇంటిలో సామగ్రి కదిలి శబ్దం రావడంతో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు బయటకు పరుగులు తీశారు. రిక్టర్ స్కేల్ పై 4.5గా భూమి కంపించినట్లు అధికారులు చెపుతున్నారు. సాలూరులోను భూమి కంపించడంతో ఇళ్ళల్లో వున్న జనం రోడ్లపైకి పరుగులు తీశారు. సమీపంలో వున్న రామభద్రపరం, బొబ్బిలిలో కూడా భూమి కంపించింది.

మా భూములకు పట్టాలివ్వండి

- జగనన్నకు చెబుదాంలో రైతుల ఏకరువు
- పలు సమస్యలపై 115 వినతులు
- పరిష్కారానికి చర్యలకు కలెక్టర్ ఆదేశం
- ఆధారాలుంటే ఆధార్ కార్డులో వయసు మార్పు

ప్రజాశక్తి-గజపతినగరం

తాతల తండ్రుల నుంచి సాగుచేస్తున్న తమ హెచ్‌ఒ భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని పురిటిపెంట గ్రామానికి చెందిన రైతులు, గ్రామపెద్దలు అధికారులను కోరారు. చాలా కాలంగా పట్టాలు లేకపోవడం వల్ల క్రయ విక్రయాలు జరగక పిల్లల చదువులు, పెళ్లిళ్లకు ఆర్థిక అవసరాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందారు. గజపతినగరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలస్థాయిలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి పలు సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన వినతులను ఆయా మండల స్థాయి అధికారులకు అందజేసి వాటిని నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

పురిటిపెంటకు చెందిన పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, ఉపసర్పంచ్ మండల సురేష్ నాయకత్వాన రైతులు సారికి బంగారు నాయుడు, మంత్రి సత్యనారాయణ, గొర్లె శ్రీనివాస్, లెంక గణేష్ తదితరులు తమ భూములకు పట్టాలివ్వాలని కలెక్టర్‌కు వినతినిచ్చారు. ఇది 296 మంది రైతుల సాగులో ఉన్న 265 ఎకరాలకు సంబంధించిన సమస్య అని, ఏళ్ల తరబడి పట్టాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌కు తెలిపారు. అలాగే ఆంధ్ర జలాశయం నుండి ఎడమ కాలువ ద్వారా నీరు పురిటిపెంట భూములకి రావాల్సి ఉండగా గంగ చోళ్ళ పెంట గ్రామంలో కాలువ చుట్టూ ఉన్న రైతులు కాలువను కప్పి వేయడం వలన పురిటిపెంట రైతులకు నీరు సమృద్ధిగా రావడం లేదని, సర్వే చేసి కాలువను పునరుద్ధరించి సాగునీరు అందించాలని రైతులు కోరారు. గజపతినగరం మండలం పురిటిపెంట రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి గాని, ఓవర్ బ్రిడ్జి గాని లేనందున వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు,

కలెక్టర్‌కు వినతినిస్తున్న పురిటిపెంట గ్రామానికి చెందిన రైతులు

రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి అండర్‌బ్రిడ్జిగాని, ఓవర్ బ్రిడ్జిగాని నిర్మించాలని కోరారు. ఇలా పలు సమస్యలపై 115వినతులు అందాయి. వాటిలో రెవిన్యూ అంశాలపై 28, ఫించన్లకోసం 34, గృహాలకు సంబంధించి 18, ప్రభుత్వ పథకాల మంజూరు కోసం 23, విద్యుత్‌కు సంబంధించిన సమస్యలపై 6, సదరం సర్టిఫికెట్ల కోసం 3, క్లాప్‌మిత్రల సమస్యలపై 1, రైతుభరోసా కేంద్రాల బిల్లుల కోసం 1 వినతులు అందాయి.

ఈ సందర్భంగా వినతులపై మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. వినతుల పరిష్కారానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, ఆయా శాఖలకు సంబంధించిన వినతులను తమ స్థాయిలో పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాల్సిన అంశాలను క్రోడీకరించి అందజేయాలన్నారు. మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపిడిఒ, ఎస్‌హెచ్‌ఒలతో ఏర్పాటు చేసిన కమిటీ ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో తరచూ సమావేశమై ఆయా సమస్యలపై చర్చించి పరిష్కరించా లన్నారు. 2019 కంటే ముందు మంజూరైన గహాలకు బిల్లుల చెల్లించాలని కోరుతూ పలు వినతులు అందాయని, వీటన్నింటినీ ఆన్‌లైన్‌లో తనిఖీ చేసి స్టేజ్ అప్‌డేషన్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట్ త్రివినాగ్, ఆర్‌డిఒ శేషశైలజ, జెడ్‌పి సిఇఒ రాజ్‌కుమార్, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు భారాలు రద్దుచేయాలి

కలెక్టరేట్ వద్ద వామపక్షాల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రజలపై వేసిన విద్యుత్ ఛార్జీ భారాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని వామ పక్షాలు నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఐఎంఎల్ జిల్లా నాయకులు బెహరా శంకర్రరావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఫలితంగా రోజు రోజుకూ విద్యుత్ ఛార్జీలు పెరుగుతూ పేద మధ్య తరగతి , పేద ప్రజానీకానికి ఆర్థిక ఇబ్బందులకు కారణమవు తున్నాయని అన్నారు. పెంచిన ఛార్జీలు తగ్గించాలని, విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని, ట్రూ అప్‌ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలు పెంపు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై నిర్వహించే ఉద్యమాలపై నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సురేష్, పి.రమణమ్మ, ఎ.జగన్‌మోహన్, ఆర్.ఆనంద్, బి.రమణ, త్రినాధ్, సిపిఐ నాయకులు అప్పన్న, సిపిఐఎంఎల్ నాయకులు రెడ్డి నారాయణరావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్నవామపక్షాల నాయకులు, ప్రజలు

జిపిఎస్ బిల్లు ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉద్యోగులు, ఉపాధ్యాయులు సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరితే రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్‌ను అమలు చేయడం దుర్మార్గమని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి అన్నారు. జిపిఎస్ బిల్లును బుధవారం అసెంబ్లీలో ఆమోదించడాన్ని నిరసిస్తూ ఆ ప్రతుల కాపీలను స్థానిక గాంధీ విగ్రహం వద్ద దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగులను, ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దు చేస్తానని ప్రకటించిన జగన్మోహన్‌రెడ్డి ఆ హామీని అమలు చేయకపోగా జిపిఎస్‌ను తీసుకొచ్చి పెన్షన్ లేకుండా చేసింది. రాజ్యాంగ బద్ధమైన పెన్షన్ హక్కును తీసేసిందని తెలిపారు. తక్షణమే బిల్లును ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, కేశవరావు, మన్యం జిల్లా రాష్ట్ర నాయకులు మధుసూధనరావు, జిల్లా నాయకులు సత్యన్నారాయణ, పట్టణ నాయకులు శ్రీనివాస్, రమేష్, సుధాకర్, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిపిఎస్ ప్రతులను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు , ఉపాధ్యాయులు

ఎస్ఐ మురళీని సస్పెండ్ చేయాలి

కోట జంక్షన్ వద్ద విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి మంగళవారం కలెక్టరేట్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన ఆందోళన సందర్భంగా విద్యార్థినులను తీవ్రంగా కొట్టి, వారిని బూతులు తిట్టిన ఒకటవ పట్టణ పోలీసుస్టేషన్ ఎస్ఐ బి.మురళిని సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, జిల్లా గర్ల్స్ కన్వీనర్ లావణ్య డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులపై బుధవారం కోట జంక్షన్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో మెస్‌ఛార్జీలు పెంచాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి మధ్యాహ్నం భోజనం పథకం అమలు చేయాలని విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేస్తే, విజయనగరం ఒకటవ పట్టణ ఎస్ఐ బి.మురళి విద్యార్థి నాయకులపై దుర్భాషలాడారని తెలిపారు. అంతేకుండా ఎం. సౌమ్య, లావణ్యలను అరెస్టు చేసి వ్యాన్‌లో తీసుకెళ్తుండగా బూతులు తిడుతూ కొట్టారని, కులాల పేరుతో దూషించారని తెలిపారు. తక్షణమే ఎస్ఐ మురళిపై అధికారులు విచారణ వేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల పోరాటాలను మరింత ఉద్రిత్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ పట్టణ కార్యదర్శి పి.రమేష్, పట్టణ కమిటీ నాయకులు సంధ్య, గుణ, మధు విద్యార్థులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

భౌతిక దాడిని ఖండిస్తున్నాం : డివైఎఫ్ఐ

విద్యార్థులను, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను రోడ్లపై ఈడ్చి, బట్టలు చించి అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నామని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ హరీష్, ఎన్.రుద్రప్రసాద్ తెలిపారు. నాయకులపై భౌతిక దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలి,భౌతిక దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రాణం ఖరీదులో వ్యత్యాసమా?

- బొబ్బిలి వ్యక్తికి ఒకలా.. బీహార్ వ్యక్తికి మరోలా..
- నష్ట పరిహారంలో తేడాతో బంధువుల్లో ఆందోళన
- ప్రభుత్వాస్పత్రి వద్ద మృతుని కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రాణం విలువ ఎవరిదైనా ఒకటే. అయినప్పటికీ ప్రాణం ఖరీదులో వ్యత్యాసం చూపించి ఒకరి ప్రాణానికి రూ.9లక్షలు, మరొకరి ప్రాణానికి రూ.3లక్షలు విలువ కట్టిన సంఘటన బొబ్బిలిలో చోటు చేసుకుంది. మూడు రోజుల క్రితం బొబ్బిలి గ్రోత్ సెంటర్లో డీజిల్ ట్యాంకు శుభ్రం చేసేందుకు దిగిన చింతాడ గ్రామానికి చెందిన పెద్దింటి పోలినాయుడు, అతడిని కాపాడేందుకు ట్యాంకులోకి దిగిన బీహార్ రాష్ట్రం పాట్నాకు చెందిన అనుష మరణించిన విషయం తెలిసిందే. మృతుని కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేయడంతో పెద్దింటి పోలినాయుడు స్థానికుడు కావడంతో రూ.9లక్షలు చెల్లించేందుకు పెట్రోల్ బంకు యాజమాన్యం అంగీకరించగా పాట్నాకు చెందిన అనుషకు రూ.3లక్షలు చెల్లిస్తామని యాజమాన్యం చెప్పడంతో పలువురు ఆశ్చర్యానికి గురవు తున్నారు. ఇద్దరూ ఒకేసారి మృతి చెందినప్పటికీ ప్రాణానికి కట్టే విలువలో ఎందుకు వ్యత్యాసం చూపుతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అనుష స్థానికుడు కాకపోతే ప్రాణం విలువ ఒకటి కాదా అని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రమాదంలో మరణించిన ఇద్దరికి ఒకేలా నష్టపరిహారం చెల్లించాలని అనుష కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మృతుని కుటుంబ సభ్యులు ఆర్తనాదాలు

డీజిల్ ట్యాంకులో దిగి మరణించిన బీహార్ రాష్ట్రం పాట్నాకు చెందిన అనుష కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. అనుష కుటుంబ సభ్యులు ఆర్తనాదాలతో ఆసుపత్రి పరిసర ప్రాంతం మారుమోగింది. అనుష తల్లిదండ్రులు బోరున విలపించారు. ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ శవపంచనామా చేసి మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాన్ని పాట్నా తీసుకువెళ్లే ఆర్థిక స్తోమత లేకపోవడంతో స్థానికులు సహకారంతో మృతదేహానికి పట్టణంలోని స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

తప్పుడు కేసు నమోదు చేయడం అన్యాయం

పెట్రోల్ బంకులో డీజిల్ ట్యాంకులో దిగి ఇద్దరు మరణిస్తే పోలీసులు యజమానిని కాపాడేందుకు సెక్షన్లు మార్చివేసి కేసు నమోదు చేయడం అన్యాయమని అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సొరు సాంబయ్య అన్నారు. డీజిల్ ట్యాంక్ శుభ్రం చేసేటప్పుడు ఎటువంటి జాగ్రత్తలు పాటించకపోవడం వల్లనే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. ఇద్దరు మరణానికి కారణమైన పెట్రోల్ బంకు యజమానిపై 304లో పార్ట్-2, సపోర్టుగా 308 సెక్షన్ కింద కేసు నమోదు చేయాల్సిన ఉన్నప్పటికీ యజమానిని రక్షించేందుకు 304ఎ సెక్షన్ కింద కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇవ్వడం అన్యాయమన్నారు. పెట్రోల్ బంకు యజమానికి స్టేషన్ బెయిల్ ఇవ్వడానికే సెక్షన్ మార్చి కేసు పెట్టారని, జిల్లా ఎస్‌పి కలుగజేసుకుని ఇద్దరి మరణానికి కారణమైన పెట్రోల్ బంకు యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ఇస్తున్న నష్టపరిహారంలో వ్యత్యాసం చూపడం దుర్మార్గమన్నారు. మృతుల కుటుంబాలకు ఒకే విధంగా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామన్నారు.

ఆస్పత్రి వద్ద రోదిస్తున్న అనుష కుటుంబ సభ్యులు

భగత్‌సింగ్ స్ఫూర్తితో

నిర్బంధాన్ని ప్రతిఘటిస్తాం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భగత్ సింగ్ స్ఫూర్తితో నిర్బంధాలను ప్రతిఘటిస్తామని సిఐటియుజిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస అన్నారు. భగత్‌సింగ్ 116వ జయంతి సిఐటియు ఆధ్వర్యాన బుధవారం ఎల్‌బిజి భవనంలో ఘనంగా నిర్వహించారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి ఎం శ్రీనివాస పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం మాట్లాడుతూ 23ఏళ్ల అతి చిన్న వయసులో దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను భగత్ సింగ్ సుఖదేవ్ ,రాజ్‌గురు త్యాగం చేశారని అన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్, బి.రమణ, కె.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు. సిపిఎం సభ్యులు బుచ్చయ్య అధ్యక్షతన ముచ్చి వాని చెరువుగట్టు వద్ద భగత్ సింగ్ జయంతి ఘనంగా జరిగింది. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం నాయకులు ఎ.జగన్మోహన్ రావు మాట్లాడుతూ నాడు బ్రిటీష్ తొత్తులుగా మారిన ఆర్‌ఎస్‌ఎస్, నేడు అధికారాన్ని చేపట్టి దేశభక్తి ముసుగులో దేశాన్ని అమ్మేస్తుందని అన్నారు. అందులో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, వామపక్షాలు పోరాడు తున్నాయన్నారు. అందులో భాగంగా అక్టోబర్ 5న కూర్మన్నపాలెంలో జరిగే ముగింపు సభకు ప్రజలంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాము, రామకృష్ణ, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్నసిఐటియు నాయకులు, విద్యార్థులు

29న స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు

ప్రజాశక్తి-విజయనగరం

ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 29న సామాజిక ఆరోగ్య కేంద్రాలలో (చీపురుపల్లి, బొబ్బిలి, బాడంగి, భోగాపురం, గజపతినగరం) ప్రభుత్వ రక్తనిధి కేంద్రం ఆధ్వర్యాన రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డిఎంహెచ్‌ఒ భాస్కరరావు తెలిపారు. జిల్లాలోని 8 రక్తనిధి కేంద్రాల నిర్వాహకులతో డిఎంహెచ్‌ఒ భాస్కరరావు బుధవారం తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. రక్త దాన శిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు.

ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి-విజయనగరం

తనతో పాటు మరో పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి మహిళలు ఎదగాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.కల్యాణ చక్రవర్తి పిలుపునిచ్చారు. వివిధ సంస్థల ద్వారా తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధి యూనిట్లను స్థాపించి జీవనోపాదులు పెంచుకోవాలని కోరారు. లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక బిసి కాలనీలోని ఎస్‌బిఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రుణ వితరణ మహోత్సవం జరిగింది. పీడీ ముఖ్య అతిధిగా హాజరై, లబ్ధిదారులకు రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తీసుకున్న రుణాలను సుమారు 99.7 శాతం తిరిగి చెల్లిస్తుండటంతో, రుణ పరపతి గణనీయంగా పెరిగిందని, ఇప్పుడు ఒక్కో సంఘం రూ.20 లక్షలు వరకు రుణాన్ని పొందే స్థాయికి ఎదిగిందని చెప్పారు. ఈ ఏడాది సుమారు 1100 కోట్ల రూపాయలను బ్యాంకు లింకేజి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మెప్మా పీడీ సుధాకరరావు మాట్లాడుతూ, ఏదో ఒక స్వయం ఉపాధి యూనిట్‌ను స్థాపించడం ద్వారా జీవనోపాది పెంచుకోవాల చెప్పారు. ఎల్‌డిఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ, బ్యాంకు రుణాలు అందరికీ అందాలన్న ఉద్దేశంతో అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం బ్యాంకులు అందిస్తున్న రుణాల్లో సుమారు 20 శాతం మహిళా సంఘాలకే అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ విజయ్ సుబ్రమణ్యం, నాబార్డు డిడిఎం నాగార్జున, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, పరిశ్రమలశాఖ ఎడి వంశీకృష్ణ, ఆర్‌శెట్టి డైరెక్టర్ రమణ, ఎఎల్‌డిఎం ప్రత్యూష, వివిధ బ్యాంకుల మేనేజర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఎస్‌బిఐ, ఎపిజివిబి, యూనియన్ బ్యాంకుల ద్వారా మెగా చెక్కులను అందజేశారు.

మహిళా సంఘాలకు చెక్కుఅందిస్తున్న డిఆర్‌డిఎ పీడీ, బ్యాంకర్లు

రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రహదారుల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాల్సిందేనని కమిషనర్ ఆర్.శ్రీరాముల నాయుడు పేర్కొన్నారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి గంటస్థంబం వరకు నూతనంగా ఏర్పాటు చేస్తున్న బిటి రోడ్డును బుధవారం ఆయన పరిశీలించారు. మురుగునీరు, వర్షపు నీటికి అడ్డంకి లేకుండా కాలువలను పూర్తి ప్రమాణాలతో నిర్మించాలని అధికారులకు సూచించారు. కోటీ రెండు లక్షల రూపాయలతో ఈ రహదారి నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా రహదారి నిర్మాణం పూర్తి చేయాలని, కుళాయి పైపులు కోసం ఇతరత్రా మరమ్మత్తుల కోసం రహదారులను పాడు చేయకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు చెప్పామన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఒ డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఇఇ శ్రీనివాసరావు, డిఇలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అధికారులతో పాటు పాలకవర్గం కూడా కృషి చేస్తుందని నగర పాలక సంస్థ మెటీరియల్ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మెటీరియల్ కమిటీ సమావేశం జరిగింది. ప్రజారోగ్య విభాగానికి సంబంధించి రూ.32లక్షలతో కొనుగోలు చేయనున్న వివిధ రకాల పరికరాలను , నాణ్యతతో పాటు వాటి ధరలను పరిశీలించారు. మెటీరియల్ కమిటీ సభ్యులు గుజ్జల నారాయణరావు, నడిపిల్లి ఆదినారాయణ, చందక శ్రీనివాసరావు, కామేష్, రమేష్ రాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా క్రీడా పోటీలు

వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో డివిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జూనియర్ కళాశాలల విభాగం అండర్ 19లో ఈనెల 29 నుంచి జరగనున్న క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని జిల్లా వృత్తి విద్యాశాఖఅధికారి ఆర్ సురేష్ కుమార్ అన్నారు. బుధవారం తమ కార్యాలయంలో జూనియర్ కళాశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆడడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందనే విషయం విద్యార్థులకు చెప్పాలన్నారు. అనంతరం ఏయే క్రీడా పోటీలు ఎక్కడ నిర్వహించాలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ వివరించారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వారిని జట్టుకు ఎంపిక చేసి రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు.

అండర్ 14 హాకీ జట్లు ఎంపిక

అండర్ 14 హాకీ జట్లు ఎంపిక పూర్తయ్యింది. బుధవారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగిన ఈ ఎంపికకు జిల్లా వ్యాప్తంగా 90 మంది బాల,బాలికలు హాజరయ్యారు. వారిలో ప్రతిభ ఆధారంగా 18 మంది బాలురు, 18 మంది బాలికలు అండర్ 14 విభాగంలో ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్‌వి రమణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు.

తైక్వాండో జట్లు ఎంపిక పూర్తి

అండర్ 14 జిల్లా స్థాయి తైక్వాండో పోటీల ఎంపిక ప్రక్రియ రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఉన్న ఇండోర్ స్టేడియంలో జరిగింది. ఈ పోటీలను స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ ప్రారంబించారు. జిల్లా వ్యాప్తంగా 150 మంది విద్యార్థులు హాజరయ్యారు.

అండర్ 19 ఫుట్ బాల్ ఎంపిక పోటీలు

ఈనెల 29న అండర్ 19 జూనియర్ కళాశాలల విభాగంలో ఫుట్ బాల్ ఎంపిక పోటీలు రాజీవ్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తామని స్కూల్ గేమ్స్ కార్యదర్శి పివిఎల్ ఎన్ కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. పోటీలకు హాజరయ్యే అభ్యర్థులు పదో తరగతి, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు పట్టుకొని హాజరు కావాలని తెలిపారు. ఉదయం 9 గంటలకు విద్యార్థులు హాజరు కావాలన్నారు. వివరాలకు 9885111375 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి కోరుతూ బుధవారం కలెక్టర్ నాగలక్ష్మికి జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు రమేష్‌నాయుడు, ఎంఎంఎల్ నాయుడు, సూరిబాబు, వెంకట్ వినతిని అందజేశారు.
-ప్రజాశక్తి, విజయనగరం

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాల అణిచివేతలు నిలువరించి అంగన్వాడీల సమస్యలకు పరిష్కారం చూపాలని సిఐటియు ఆధ్వర్యంలో సెక్టార్ కేంద్రాల వద్ద బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బలసా శ్రీను నాయకత్వంలో ఆరికతోట, బూసాయవలస, రామభద్రపురం సెక్టార్ కేంద్రాల వద్ద ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇటీవల విజయవాడ, జిల్లా కలెక్టరేట్ల వద్ద తమ సమస్యల పరిష్కారం కోసం చేసే దీక్షలు బలవంతంగా భగ్నం చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ అమలు చేసి తెలంగాణ మాదిరిగా జీతాలు పెంచాలని, అర్హులైన వారికి సూపర్‌వైజర్ పోస్టులు ఇవ్వాలని, అంగన్వాడీ టీచర్ ఆకస్మికంగా చనిపోతే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, అధికార వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు సత్యవతి, అరుణ, రాధమ్మ, రమణి కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల జాబితా పరిశీలన

వేపాడ: మండలంలోని అరిగిపాలెం బుధవారం కొత్తగా మంజూరైన పింఛన్ల లబ్ధిదారుల జాబితాను ఎంపిడిఒ పట్నాయక్ పరిశీలించారు. పింఛను మంజూరైన లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

బొబ్బిలి : స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ పి.శేష శైలజ రాజకీయ పార్టీల నేతలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎస్‌ఎస్‌ఆర్ 2024 సందర్భంగా సమావేశం నిర్వహించి ఎన్నికల జాబితాలో చేర్పులు, మార్పులు సవరణలను రాజకీయ పార్టీల నేతలకు ఆర్‌డిఒ శేషశైలజ, తహశీల్దార్ డోల రాజేశ్వరరావు వివరించారు. అనంతరం పట్టణంలోని 55,56 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. సమావేశంలో టిడిపి, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, లోక్‌సత్తా, జనసేన ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

భోగాపురం : అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ సంస్థ అయిన జిఎంఆర్ సిబ్బంది ఉండేందుకు రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన చేస్తున్నారు. దీనిలో భాగంగా బసవ పాలెం రెవెన్యూ పరిధిలోని దివిస్ కొండ దిగువ బాగానున్న ప్రభుత్వ డీపట్టా భూములను ఇదివరకే పరిశీలించారు. ఇక్కడ విశాఖపట్నం జిల్లాకి మనకు సరిహద్దు కావడంతో ఆ జిల్లా అటవీ శాఖ అధికారులతో పాటు భోగాపురం తహశీల్దార్ చింతాడ బంగార్రాజు, ఉప తహశీల్దార్ శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. అక్కడ 75 ఎకరాలు భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

గజపతినగరం: అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎంఎస్‌వి రవి ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని పురిటిపెంట, గంగచోళ్లపెంట గ్రామాలలో హై స్కూల్ విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది,ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

కొత్తవలస: ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతిస్తుందని ఐసిడిఎస్ పిఒ ఆర్. ఉమాదేవి, ఎసిడి పిఒ బి.లక్ష్మీబాయి అన్నారు. రాష్ట్ర పోషణ మహా కార్యక్రమంలో భాగంగా కొత్తవలస ప్రాజెక్టు పరిధిలో గల, అప్పన్న దొరపాలెం అంగన్వాడి కేంద్రం వద్ద పోషకాహార మాసోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్తహీనత రాకుండా పోషకాహార లోపం లేకుండా తగు జాగ్రత్త తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలకు తల్లిపాలు ఆరు నెలల పాటు తప్పనిసరిగా తాగించాలని తెలిపారు. చిన్నారులకు తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారాన్ని కూడా ఇవ్వాలని సూచించారు. సెక్టార్ సూపర్‌వైజర్ కె.రమణమ్మ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సత్యనారాయణమ్మ, శంకరావతి, లక్ష్మి శారద తదితరులు పాల్గొన్నారు.

రైతులను గుర్తించాలి

రేగిడి: పండ్ల తోటల పెంపకానికి రైతులను గుర్తించి, పనులు ప్రారంభించాలని ఎపిడి మీసాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రేగిడి ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి ఎక్కువ మంది రైతులను ఎంపిక చేయాలన్నారు. పండ్లతోటలు పెంపకానికి రాయితీ ఇవ్వాలన్నారు. 39 గ్రామ పంచాయతీల్లో గృహాలు నిర్మించిన వేతనదారులకు 90 రోజులు హౌసింగ్ పేమెంట్ చేయాలని సూచించారు. ఎపిఒ సంకాబత్తుల హరినాథ్, ఈసీ రామినాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నెల్లిమర్ల: యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ పి. నారాయణ రావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలలో మాదక ద్రవ్యాలు వినియోగం, వాటి వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కి అలవాటు పడిన వారు విచక్షణ కోల్పోయి హత్యలు చేసే స్థాయికి వెళ్తారని ఆ పరిస్థితికి చేరకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ ఎం.సత్య నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో కషాయాల తయారీ

గరివిడి : మండలంలోని గెడ్డపువలసలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా బుధవారం రైతులు కాషాయాలు తయారు చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ కార్యకర్త తుమ్మగంటి సుశీల తెలిపారు. ఆరోగ్యాలు బాగుంటాయని, భూమి సారవంతమవుతుందన్నారు. వేప, జిల్లేడు, మారేడు, బొప్పాయి, ఉమ్మత్త, జామ, కానుగ, సీతాఫలం, ఆముదం, మునగ, అరటి, సూపర్ నేపియర్ గడ్డి, కలబంద, గన్నేరు, అన్ని 2కేజీల చొప్పున తీసుకొని చిన్న చిన్న ముక్కలుగా చేసి 200లీటర్ల డ్రమ్ములో వేయాలన్నారు. నీరు పోసి కలియతిప్పిన తరువాత మూత పెట్టి, కనీసం 5-7 రోజులు మురగ బెట్టినట్లితే పలు పత్ర ద్రావణం తయారవుతుందన్నారు. ఇలా తయారైనా పలుపత్ర ద్రావణన్ని పది లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చెయ్యాలన్నారు. ఈ ద్రావణం బలవర్ధకంగా, గ్రోత్ ప్రమోటర్‌గా, పురుగులు, తెగుళ్ల నివారిణిగా ఉపయోగపడుతుందన్నారు. అన్ని రకాల పంటలకు అన్ని దశల్లో వాడవచ్చునన్నాఉ ఇది ఆరు నెలలు నిల్వ ఉంటుందని ఆమె తెలిపారు.

సైకిల్ షెడ్ ఏర్పాటుకు విద్యార్థుల డిమాండ్

రేగిడి: అంబాడ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు గ్రామాల నుంచి విద్యను అభ్యసించేందుకు వచ్చిన విద్యార్థుల సైకిలు పెట్టేందుకు షెడ్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. సైకిల్ షెడ్ లేకపోవడంతో సైకిళ్లు బయట వర్షానికి తడిసి, ఎండలకు పంచర్లు అయిపోతున్నాయని, దీంతో గ్రామాలకు చేరలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలైతే మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యార్థులు వాపోయారు. అధికారులు స్పందించి షెడ్ ఏర్పాటు చేయాలన్నారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడే అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారనికలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి సహేతుకమైన కారణాన్ని చూపుతున్నామని, ఆ తర్వాతే ప్రక్రియను సాగిస్తున్నామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ, ఇతర అంశాలపై సమీక్షించే నిమిత్తం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 20 నుండి ఇవిఎంల ఫస్ట్ లెవెల్ చెక్ జరుగుతుందని, ఈ కార్యక్రమం సుమారు 20 రోజులు జరుగుతాయని, రాజకీయ పార్టీల నుండి వారి ప్రతినిధులను కూడా ఈ కార్యక్రమానికి పంపాలని కలెక్టర్ కోరారు. నగర ప్రాంతాల్లో ఒకే చోట ఎక్కువ మంది ఓటర్లు ఉన్న చోట, గేటెడ్ కమ్యూనిటీ లలో వెయ్యి మంది ఓటర్లు ఉన్న చోట అవసరమైతే వారికోసం ఒక పోలింగ్ స్టేషన్ ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రత్యేక ఉప కలెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర రావు, దొర, పద్మలత, నూకరాజు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దేవ్ ప్రసాద్, ఎన్నికల డిటీలు పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రంలో టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు పద్మశాలీలు బుధవారం మద్దతు ప్రకటించారు. పద్మశాలి సాధికార సమితి జిల్లా కన్వీనర్ వానపల్లి వీరభద్రరావు, కొండపల్లి లక్ష్మణరావు ఆధ్వర్యంలో కార్యకర్తలతో దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, డెంకాడ మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, భోగాపురం మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు లెంక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: స్థానిక ఆటల డిపో వద్ద 14వ రోజు రిలే నిరాహారదీక్షలో తెప్పెల గుళ్ళ కళాకారులు, జామి మండల టిడిపి అధ్యక్షుడు లగుడు రవికుమార్ సంఘీభావం తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో నాయకులు రాయవరపు చంద్రశేఖర్, ఎం.మంగరాజు, రెడ్డి పైడిబాబు, బండారు పెదబాబు, ఇప్పాక త్రివేణి, వర్మ రాజు, గేదెల సతీష్, జుర్రెడ్డి వెంకటరావు, లగుడు అప్పలనాయుడు, గుంటూరు శివ సంతోష్ పాల్గొన్నారు.

అరెస్టును ఖండించిన మహిళలు

చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను మహిళలు ముక్తకంఠంతో ఖండించారు. బుధవారం పట్టణంలోని దారగాయన్న ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో నియోజకవర్గంలోని 350 మంది టిడిపి మహిళలు, నాయకులు, కార్యకర్తలు సంతకాలు చేసి, చంద్రబాబు మద్దతుగా బాబుతో నేను సైతం అంటూ నల్ల బెలూన్లు, ప్లకార్డులు చేతపట్టుకొని, నల్ల బ్యాడ్జీలు, కండువాలు ధరించి, వైకాపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, వేపాడ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి పాల్గొన్నారు.



ఎస్‌కోట.. నల్లకండువాలతో నిరసన తెలుపుతున్న కోళ్ల లలితకుమారి

బాడంగి: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలో గురువారం దీక్షలు చేపడతామని టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దీక్షకు నియోజకవర్గ ఇంచార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు హాజరవుతారని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. **రాజాం:** మరి కొద్ది నెల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా నీ పని అయిపోయింది తట్టా - బుట్టా సర్దేసుకోండి అంటూ వైసిపి ప్రభుత్వం పై టిడిపి రాజాం టౌన్ కమిటీ ప్రధాన కార్యదర్శి శాసపు రమేష్ కుమార్ విరుచుకుపడ్డారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి తన పిల్ల చేష్టలతో చంద్రబాబుని జైల్లో ఉంచినంత మాత్రాన టిడిపి నాయకుల నైరాశ్యంలోకి వెళ్ళిపోరని, గోడకి కొట్టిన బంతిలా మరింత విశ్వాసంతో ముందుకు వెళతారని చెప్పారు.

రామభద్రపురం: స్థానిక పార్టీ కార్యాలయం ఎదురుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం కొనసాగాయి. ఈ దీక్షలకు టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబీనాయన సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు కరణం విజయ భాస్కరరావు, చింతల చిన్నమ్మ తల్లి, వివిధ గ్రామాల సర్పంచ, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: చంద్రబాబు అరెస్ట్ అక్రమమని కరపత్రాల ద్వారా ప్రజలకు చెప్పాల్సిన సమయం వచ్చిందని టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యన్నారాయణ అన్నారు. పోలిపల్లి గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలతోపాటు వైఫల్యాలను కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇంచార్జిలు పిడుగు తోటరావు, దాసరి అప్పలస్వామి, తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు, నాయకులు బొడ్డ హరిబాబు, లోకేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.**విజయనగరం కోట:** నగరంలోని ఒక హోటల్లో టిడిపి నాయకులు గణపతినీడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'న్యాయం కోసం నారీగళం' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మీ, నాయకులు విమలారాణి, రాధామణి, రెడ్డిపల్లి ఉషారాణి, పత్తిగిల్లి సూర్యకుమారి, జనసేన ఉత్తరాంధ్ర మహిళా కో ఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీరాజ్యం, చిల్లపద్మ, కొర్నాన రాజ్యలక్ష్మి, పాల్గొన్నారు. **బొబ్బిలి:** చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా బొబ్బిలిలో టిడిపి చేపట్టిన రిలే నిరహదీక్షలు కొనసాగుతున్నాయి. 15వ రోజు బుధవారం దీక్షలను నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన ప్రారంభించారు. చంద్రబాబుపై అక్రమ కేసులను ఎత్తి వేయాలని బేబినాయన డిమాండ్ చేశారు. దీక్షలలో పెంట, రంగరాయపురం, చెల్లారపువలస టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామభద్రపురం... దీక్షలో పాల్గొన్న బేబినాయన

పోస్టర్ ఆవిష్కరిస్తున్న విసి, తదితరులు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో గోడ పత్రికను వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుధవారం తన ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్, పారామెడికల్ కోర్సులలో ప్రవేశాలు పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, అడ్మిషన్స్ ఎజిఎం చిరంజీవి, రీజినల్ మేనేజర్ వివిఎస్ ప్రతాప్ పాల్గొన్నారు.

కొత్త మెళకువలతో బోధించాలి

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని బొద్దాం, సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలల సముదాయం రెండోరోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎంఇఒ పి. బాలభాస్కరరావు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు బోధనలో కొత్త మెలుకవలతో పిల్లలకు చెప్పాలన్నారు. నిత్యం స్టడీ అవర్స్ పెట్టి వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వేపాడ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్ఎస్ వల్లి, ఆర్ రామసత్యం, సిఆర్‌పిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇ-పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని జియ్యన్నవలస, నెలివాడ రెవెన్యూ గ్రామాలలో ఈ క్రాఫ్ నమోదులో భాగంగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి బుదవారం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. ఈ మేరకు జియ్యన్నవలస, నెలివాడ గ్రామాల్లో 2023 ఖరీఫ్‌లో ఇ-పంట నమోదు ప్రక్రియను తనిఖీ చేసి ఆయా గ్రామాల రైతులతో మాట్లాడి ఇ-పంట నమోదు తీరును ఆరా తీశారు. ఈ మేరకు గొట్లాంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సిరి చందన, నెలివాడలో గ్రామ వ్యవసాయ సహాయకులు అనిల్ నుండి ఇ-పంట నమోదు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జియ్యన్నవలసలో ధాన్యానికి సంబంధించి 430 ఎకరాలకు గాను 355 ఎకరాలను, ఉద్యానవన పంటలకు సంబంధించి మొత్తం 252 ఎకరాలు పూర్తిగా ఇ-పంటను నమోదు చేశామని కలెక్టర్‌కు వ్యవసాయ సహాయకులు సిరి చందన వివరించారు. నెలివాడలో దాన్యానికి సంబంధించి 360 ఎకరాలుకు గాను 340 ఎకరాలను, ఉద్యానవన పంటలకు సంబంధించి మొత్తం 520 ఎకరాలు పూర్తిగా ఇ-పంటను నమోదు చేశామని వ్యవసాయ సహాయకులు అనిల్ వివరించారు. రెండు గ్రామాలలో ఇ-పంట నమోదు పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 30లోగా ఇ-పంట నమోదు చేయాలని, రైతుల ఇకెవైసి చేపట్టాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ ప్రసాదరావు, వ్యవసాయ అధికారి పివి.మల్లికార్జున రావు, పిఎసియస్ అద్యక్షులు మహంతి రమణ, విఆర్ఒలు దుర్గ, ఎన్ దివ్య, ప్రభాకర్, డి.రవి, రైతు మీసాల తులసీ రావు, మండల రామునాయుడు పాల్గొన్నారు.

ఇ-పంట వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆరోగ్య సురక్షతో వైద్య సేవలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని అమకాం గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఎంపిడిఒ డిడి స్వరూపరాణి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా సచివాలయాన్ని సందర్శించి కార్యదర్శిని, సిబ్బంది పని తీరును అడిగి తెలుసు కున్నారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరై ప్రజల కోసం సేవలందించాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సర్వేను పరిశీలించారు. మండలంలో ఈ సర్వే మందకొడిగా సాగుతుందని వాలంటీర్లు అందరూ విధిగా పాల్గొని సర్వే పూర్తి చేయాలని కోరారు. సర్వేలో పాల్గొనని వాలంటీర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను కూడా ఆమె సందర్శించారు. ఈ వైద్య శిబిరంలో 50 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారని తెలిపారు. అనంతరం బెల్లాంలో అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు.

సర్వే వివరాలను అడిగితెలుసుకుంటున్న ఎంపిడిఒ

వేపాడ: మండలంలోని సింగరాయలో బుధవారం సర్పంచ్ ఎన్ వెంకట్రావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ అక్టోబర్ 17వ తేదీన గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేస్తారని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ప్రజాశక్తి- రేగిడి

కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేసి, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని సంకిలి ఈఐడి ప్యారి షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మికు చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చి దేశంలో ఉన్న కార్పొరేట్ కంపెనీలకు ప్రైవేట్ కంపెనీలకు కార్మికు వర్గాన్ని బానిసలుగా తయారు చేసేందుకు సిద్ధమవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు, పారిశ్రామిక సంబంధాలు, వృత్తిపర భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్స్‌ను కేంద్రం సూచనలతో కోడ్స్‌కు అనుబంధంగా రూల్స్‌ను ప్రతిపాదించిందన్నారు. లేబర్ కోడ్స్‌ను ఏకపక్షంగా కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ పథకాలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో చర్చకు పెట్టకుండానే నోటిఫికేషన్ ద్వారా మార్చే అధికారం తీసుకుందన్నారు. లేబర్ కోడ్స్ అమలైతే పారిశ్రామిక ప్రమాదాల్లో యజమానులకు ఏ బాధ్యత ఉండదన్నారు. కార్మికుల జీవితాలపై ఎంతో ప్రభావాన్ని కలిగించే ఈ రూల్స్ ప్రతులను కనీసం కార్మిక సంఘాలకు ఇవ్వకుండా ఏకపక్షంగా అమలు చేయాలనే దురాలోచన ఇందులో కనబడుతోందన్నారు. తక్షణమే గుర్తింపు పొందిన జాతీయ కార్మిక సంఘాలన్నింటితో సంయుక్త సమావేశానికి ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్, సతీష్, విఆర్‌సి నాయుడు, శ్రీనివాసరావు, దాలినాయుడు, రాంబాబు, వెంకటరమణ, సుధాకర్, గోవిందు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

క్వారీ అనుమతులకు ప్రజావేదిక

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలిపాడు రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబరు 58లో 8 ఎకరాల విస్తీర్ణంలో రాతి క్వారీ నిర్వహణకు బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి అనిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ముందుగా సర్పంచ్ బీల రాజేశ్వరి మాట్లాడుతూ ఇంతవరకు తమ గ్రామంలో క్వారీల నిర్వహణకు ఎప్పుడూ సమావేశాలు జరగలేదన్నారు. క్వారీలు ఏర్పాటు చేయడం వల్ల ఆదాయం వచ్చి గ్రామాభివృద్ధి జరుగుతుంది కానీ లారీలు రాకపోకలు వల్ల గ్రామంలో పలువురు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ మధ్యకాలంలో ఇటువంటి ప్రమాదంలో ఒకరు మరణించారని గుర్తు చేశారు. వావిలపాడు నుంచి దేవరపల్లి, కొత్తవలస వెళ్లి రోడ్డు మూడు కిలోమీటర్ల పొడవున వెడల్పు చేస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. సమావేశానికి హాజరైన వారంతా క్వారీ ఏర్పాటుకు ఆమోదం తెలిపితే తనకు ఎటువంటి అభ్యంతరమూ లేదన్నారు. సచివాలయ జెఎసి కన్వీనర్ బీల సతీష్ మాట్లాడుతూ గోగాడ జగన్నాథం నాయుడు క్వారీకి అనుమతులు కోసం ప్రజాభిప్రాయ పెట్టడం మంచి పరిణామమన్నారు. క్వారీ ఏర్పాటు చేయడం వల్ల గ్రామంలో కొంతమంది యువతకు ఉపాధి కలిగే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా క్వారీకి ఆనుకొని ఉన్న పంట పొలాల నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం క్వారీ నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న గోగాడ జగన్నాథం నాయుడు మాట్లాడుతూ గ్రామస్తులందరూ సహకారంతో ఏర్పాటు చేస్తున్న క్వారీ వల్ల గ్రామానికి గ్రామ ప్రజలకు ఏ విధమైన హాని జరగకుండా చూసే బాధ్యత తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో భూగర్భ గనుల శాఖ ఎంఇ సరిత, తహశీల్దార్ కె ప్రసన్నకుమార్, డిటి సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ రాజేశ్వరి

హాస్టల్‌ను మార్చొద్దని దళిత సంఘాల వినతి

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ఎస్‌సి బాలుర వసతి గృహాన్ని బీసీ బాలికల వసతి గృహంగా మార్పు చేయొద్దని దళిత సంఘాల నాయకులు అధికారులను వేడుకున్నారు. మండల ప్రత్యేకాధికారి ఆర్. పాపారావు, ఎంపిడిఒ వై. పద్మజ, తహశీల్దార్, వెల్ఫేర్ అధికారులు, ఎంఇఒ బుధవారం వసతి గృహం మార్పు చేద్దామని హాస్టల్‌కు వచ్చారు. ఈ విషయాన్ని గమనించిన దళిత సంఘాల నాయకులు బోని కృష్ణ నాయకత్వంలో దళిత సంఘాల నాయకులు వసతి గృహాన్ని మార్పు చేయొద్దంటూ ప్రత్యేకాధికారి వినతి పత్రాన్ని అందించారు. ఇప్పటికే హాస్టల్లో 52 మంది విద్యార్థులు ఉన్నారని గుర్తు చేశారున గత కొంతకాలంగా బీసీ బాలికల హాస్టల్ వాతావరణం బాగోలేదని ఈ హాస్టల్‌ను హైస్కూల్ సమీపంలో గల ఎస్‌సి బాలుర హాస్టల్‌కు మార్పు చేయాలని అధికారులు సూచించారు. బాలికల హాస్టల్‌లో వసతులు బాగోలేదని, తరచూ విద్యార్థులు రోగాలకు గురవుతున్నారని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో అధికారులు హాస్టళ్లను పరిశీలించారు.

అధికారులతో మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

హౌసింగ్ పనిదినాల కల్పనపై సమీక్ష

ప్రజాశక్తి - తెర్లాం

స్థానిక మండల పరిషత్తు కార్యలయంలో బుధవారం ఉపాధిహామీ సిబ్బందితో ఎంపిడిఒ రామకృష్ణ సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ పనిదినాల కల్పన, బిల్లుల చెల్లింపులు, కొత్త పనుల గుర్తింపు, ఎన్ఎంఎంఎస్ యాప్ తదితర అంశాలపై క్లస్టర్ వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ జగనన్న హౌసింగ్‌కి 1469 ఇళ్లకు సంబంధించి 1.46 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉన్నా ప్రస్తుతానికి 63 వేల పని దినాలు కల్పించారన్నారు. ఇంకా 83వేల పనిదినాలు పెండింగ్ ఎందుకు వున్నాయని ప్రశ్నించారు. ఒక ఇళ్ళు నిర్మాణానికి సంబంధించి 90 రోజులు ఒక వ్యక్తికి కల్పించాలి కానీ కనీసం నేటి వరకు సగం పనిదినాలు కూడా కల్పించక పోవడంతో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు పై అసహనం వ్యక్తం చేశారు. వచ్చే వారం నాటికి పురోగతి సాధించక పోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యాప్‌లో హార్టీకల్చర్ వివరాలను పొందుపరచాలని, బిల్లుల చెల్లింపులు సకాలంలో చెల్లించాలని, కొత్త పనులను గుర్తించాలని టెక్నికల్ అసిస్టెంట్లకు ఆదేశించారు.

సిటిజన్ అవుట్, రీచ్ సర్వే పై సమీక్ష

అనంతరం ఆరోగ్య సురక్ష, చెత్త శుద్ధి కేంద్రాల నిర్వహణ, శానిటేషన్, గడప గడపకి మన ప్రభుత్వం, సచివాలయాల నిర్వహణ, ఈ -సర్వీసులు, సిటిజెన్ అవుట్ రీచ్ సర్వేపై పంచాయతీ తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఒ సమావేశం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం కావాలని, ఏర్పాట్లలో ఎటువంటి అలసత్వం వహించకుండా సిబ్బందికి దిశానిర్దేశం చేయాలన్నారు.

వాలీబాల్ పోటీలకు నలుగురు

గజపతినగరం: జిల్లాస్థాయి వాలీబాల్ అండర్ -14, అండర్ -17 పోటీలకు గజపతినగరం బాలికొన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన నియోజకవర్గస్థాయి వాలీబాల్ స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు వీరు సత్తా చాటారు. బాలికొన్నత పాఠశాలకు చెందిన ఏ వెంకట సుష్మ, జి.రాజేశ్వరి అండర్ 17 జట్టుకి ఎంపిక కాగా, ఎస్. గాయత్రి, బి.శరణ్య అండర్ -14 జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 29న విజయనగరం రాజీవ్ క్రీడా మైదానంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో నియోజకవర్గం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. ధార్రాజు, టి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్. రమేష్ కుమార్, ఉపాధ్యాయులు కోరాడ లత, హరికుమార్, డి. వెంకట్రావు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

రైల్వే ట్రాక్‌పై పడి ఉన్న మంగమ్మ, నవీన్(ఫైల్)

రెండు రోజుల్లో తల్లీ కొడుకు మృతి

ప్రజాశక్తి- బాడంగి

మండలలోని గొల్లాది గ్రామానికి చెందిన ఇమంది మంగమ్మ(45), నవీన్(12) ఒక రోజు వ్యవధిలో మృతి చెందారు. మంగమ్మ తన భర్త అప్పన్నతో కలిసి 4సంత్సరాలు క్రితం చెన్నై వెళ్లి కూలి పనులు చేసికొంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నవీన్, దివ్య ఉన్నారు. వీరిద్దరూ గొల్లాది జెడ్‌పి స్కూల్లో 7, 9వ తరగతి చదువుతున్నారు. చెన్నైలో ఉన్న అమ్మానాన్నలను చూద్దామని నవీన్ పది రోజులు క్రితం చెన్నై వెళ్లాడు. 24వ తేదీ రాత్రి తల్లీతో కలిసి కూరగాయలు కోసం బజారుకు వెళ్లారు. పట్టాలు దాటే సమయంలో ట్రైన్ వచ్చి డీ కొంది. ఈ ప్రమాదంలో తల్లి అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడ్డ నవీన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 26న చనిపోయాడు. మంగమ్మ మృత దేహం బుధవారం గొల్లాది గ్రామానికి తీసికొచ్చి అంత్యక్రియలు చేయగా నవీన్ మృతదేహాన్ని గురువారం గ్రామానికి తీసికొస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లీ కొడుకు మరణంతో ఒక్కసారిగా గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - విజయనగరం

చోరీ కేసులో ఇద్దరు దొంగలను పట్టుకున్నామని రెండో పట్టణ సిఐ విజయానంద్ తెలిపారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ దొంగతనం వివరాలను వెల్లడించారు. పట్టణంలో పివిజి నగర్‌లో నివాసం ఉంటున్న బంగారు వస్తువుల తయారీ చేసే వ్యక్తి పొన్నాడ అప్పలరాజు ఈ నెల 19న ఇంటికి తాళాలు వేసుకొని, తన అత్తవారింటికి వెళ్లాడు. గుర్తు తెలియని దొంగలు, ఇంటి తాళాలు పగులగొట్టి, బీరువాలో గల ఎనిమిదిన్నర తులాల బంగారు ఆభరణాలు దోచుకొని పోయినట్లుగా ఆయన ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఈ నెల 26న నల్ల చెరువు వద్ద పివిజి నగర్, పూల్బాగ్‌కు చెందిన పటాన అస్లాం, షేక్ షాజన్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకొని, వారిని విచారించారు. వారి వద్ద నుండి దొంగతనం చేసిన ఎనిమిదిన్నర తులాల బంగారు వస్తువులు, బిస్కెట్ ముక్కలను, రూ. 6 లక్షల నగదు రికవరీ చేసి, నిందితులను రిమాండుకు తరలించామని సిఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని సవరవల్లి జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన బండారు సూర్యారావు (62) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. సూర్యారావు రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో సూర్యారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణమూర్తి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సూర్యారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.